సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 5 । జూన్ । 2023



మహిళా 'ఏపీఎల్-2'
ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో మహిళా ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) టీ-20 క్రికెట్ టోర్నీ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది.
- 8లో



క్రికెట్ క్రీడాకారుల ఎంపిక
జిల్లా స్థాయిలో నిర్వహించే క్రికెట్ క్రీడాకారుల ఎంపికల్లో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజు స్పష్టం చేశారు.
- 8లో

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతం
విజయనగరం అర్బన్: ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ కళాశాల ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. విజయనగరం జిల్లా కేంద్రంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల, ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రాలలో రెండు షిఫ్టులలో జరిగిన ఈ పరీక్షకు 1,322 మంది హాజరు కావాల్సి ఉండగా 1,294 మంది మాత్రమే హాజరయ్యారు. ఉదయం 1,036 మందికిగాను 1,016 మంది, మధ్యాహ్నం 286 మందికిగాను 278 మంది పరీక్షకు హాజరయ్యారు.

న్యూస్‌రీల్

పులిగుమ్మిలో ఏనుగుల సంచారం



పులిగుమ్మి పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కొమరాడ: ప్రజలకు గజరాజుల బాధలు వీడడం లేదు. ఇటీవల కురుపాం మండలంలో పలు గ్రామాల్లో సంచరించిన ఏనుగుల గుంపు ఆదివారం కొమరాడ మండలం వన్నాం పంచాయతీ పులిగుమ్మి గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నాయి. వీటి సంచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మాదలింగి, పాలేం, పూజరిగూడ, దళాయపీట, నిమ్మలపాడు తదితర గ్రామాల్లో సంచరించే అవకాశం ఉందని, రాత్రి పూట ప్రయాణించే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాత్రి పూట రైతులు పొలాల్లోకి వెళ్లొద్దని కోరారు.

నేత్రపర్వంగా జగన్నాథస్వామికి జ్యేష్టాభిషేకం



జగన్నాథస్వామికి సుగంధ ద్రవ్యాలతో శుద్ధిస్నానం

వీరఘట్టం: వీరఘట్టంలోని మందిరం వీధిలో వెలసిన జగన్నాథస్వామికి జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా ఆదివారం జ్యేష్టాభిషేకం(దేవస్నానం) చేశారు. అనంతరం స్వామివారు అస్వస్థతకు గురవడంతో 15 రోజుల పాటు చీకటి గదిలో విశ్రాంతి తీసుకుంటారని, అనంతరం అమావాస్య రోజు శుద్ధి స్నానం చేసిన తరువాత రథయాత్రకు బయలుదేరుతారని అర్చకులు లింగరాజ్‌రథో తెలిపారు. లోక కల్యాణం కోసమే స్వామి వారు రథయాత్ర చేపట్టినట్టు పురాణాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 18న నేత్రోత్సవం, 20న జగన్నాథ రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. 24న హిరాపంచమి అనంతరం ఈ నెల 28న మారు రథయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు.

సాగుకు సన్నద్ధం

జిల్లాలో సాగునీటి వనరులు ఖరీఫ్ సాగుకు నీరందించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందుకు తగిన ప్రణాళికలను జల వనరుల శాఖ అధికారులు ముందస్తుగానే సిద్ధం చేసి సాగుకు సన్నద్ధమవుతున్నారు. దీంతో రైతులు కూడా ఖరీఫ్ సాగుకు అడుగులు వేస్తున్నారు. ఇదే సమయంలో ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాల పంపిణీకి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధమై సంబంధిత రైతుభరోసా కేంద్రాలకు చేరవేసింది.

- ఈ నెలాఖరుకు ప్రధాన పాజెక్టులకు సాగునీటి విడుదల
- పరవళ్లు తొక్కుతున్న సాగునీటి వనరులు
- ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు
- ప్రభుత్వ చర్యలతో ఈ ఏడాది సమృద్ధిగా అందనున్న సాగునీరు
- ఖరీఫ్‌కు ముందస్తు ప్రణాళికలు
- సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్నలు
- ఇప్పటికే పంపిణీకి సిద్ధం చేసిన విత్తనాలు, ఎరువులు
- పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు లక్ష్యం 1.75 లక్షల ఎకరాలు



తోటపల్లి జలాశయంలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

వీరఘట్టం:

పార్వతీపురం మన్యం జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న జీవనది నాగావళి. ఈ నదిపై ఉన్న తోటపల్లి ఆనకట్టలతో పాటు రావాడ వద్ద ఉన్న వట్టిగెడ్డ జలాశయం, సువర్ణముఖి నదికి ఆనుకుని ఉన్న వెంగళరాయసాగర్, వేగావతి నదికి ఆనుకుని ఉన్న పెద్దగెడ్డ రిజర్వాయర్, పెదంకలాం ప్రధాన కాలువలు, జంఝావతి జలాశయాల్లో ప్రస్తుతం నీరు పుష్కలంగా ఉండడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. మరోవైపు వ్యవసాయ రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసిన ప్రభుత్వం సాగునీటి వనరులపై ముందుగానే దృష్టి సారించింది. ప్రభుత్వం సమయానుకూలంగా స్పందిస్తోంది. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల

అభివృద్ధితో పాటు వ్యవసాయంపై ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లాలో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలో ఉన్న ప్రధాన జలాశయాలైన తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టుల్లో నీరు ఆశాజనకంగా చేరింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.75 లక్షల ఎకరాల్లో వరిసాగు

ప్రాజెక్టు	: తోటపల్లి
గరిష్ట నీటి మట్టం	: 105 మీటర్లు
ప్రస్తుతం ఉన్న నీటి మట్టం	: 103.81 మీటర్లు
జిల్లా పరిధిలో కాలువలు	: కొత్త కుడి, పాత కుడి, ఎడమ
ఆయకట్టు	: 89 వేల ఎకరాలు

చేపట్టేందుకు వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళికలతో సిద్ధమవుతోంది. దీనికి జల వనరుల శాఖ అధికారులు కూడా సమాయత్తమవుతున్నారు. జూన్ నెలాఖరులో ఈ ఏడాధి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల చేసేందుకు చర్యలు చేపడుతుండడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

తోటపల్లి పరిస్థితి ఇలా...

తోటపల్లి ప్రాజెక్టు ద్వారా పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలో 1.99 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కొత్త కుడి కాలువ పరిధిలో 1.35 లక్షల ఎకరాలు, పాత కుడి, ఎడమ కాల్వల పరిధిలో 64 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో పార్వతీపురం మన్యం జిల్లాలోని 89 వేల ఎకరాల ఆయకట్టుకు తోటపల్లి ద్వారా నీరందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ట నీటి సామర్థ్యం 2.50 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 1.79 టీఎంసీల నీరుంది. అలాగే గరిష్ట నీటిమట్టం 105 మీటర్లు కాగా ప్రస్తుతం 103.81 మీటర్లు ఉంది. మరో వైపు అప్పుడప్పుడు వర్షాలు కురుస్తుండడంతో ఈ నీటి నిల్వలతో జిల్లాను సస్యశ్యామలం చేయవచ్చునని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.



తోటపల్లి జలాశయం

ప్రాజెక్టు	: వెంగళరాయసాగర్
ఆయకట్టు	: 24,700 ఎకరాలు
జలాశయం	: వట్టిగెడ్డ
ఆయకట్టు	: 16,680 ఎకరాలు
కాలువ	: పెదంకలాం
ఆయకట్టు	: 8,257
జలాశయం	: పాచిపెంట పెద్దగెడ్డ
ఆయకట్టు	: 12,200 ఎకరాలు
ప్రాజెక్టు	: జంఝావతి
ఆయకట్టు	: 24,500 ఎకరాలు

సాగునీటి వనరులు సిద్ధం

తోటపల్లితో పాటు ఈ ఏడాది ఖరీఫ్‌కు మరి కొన్ని గెడ్డలు, కాల్వలు, జలాశయాలు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో ప్రధానమైన జంఝావతి ప్రాజెక్టు ద్వారా 24,500 ఎకరాలకు, వెంగళరాయసాగర్ ద్వారా 24,700 ఎకరాలకు, రావాడ వద్ద ఉన్న వట్టిగెడ్డ జలాశయం ద్వారా 16,680 ఎకరాలకు, పెదంకలాం ప్రధాన కాల్వ ద్వారా 8,257 ఎకరాలకు, పాచిపెంట పెద్దగెడ్డ ద్వారా 12,200 ఎకరాలకు సాగునీరు అందించి ఖరీఫ్‌ను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది.

నెలాఖరులో నీటి విడుదల

తోటపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం నీరు పుష్కలంగా ఉంది. ఖరీఫ్‌కు ఎటువంటి ఇబ్బంది లేదు. జూన్ నెలాఖరులో నీరు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కొద్ది రోజుల్లో అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించి ప్రణాళిక ప్రకారం సాగునీరు అందిస్తాం. అలాగే శివారు వరకు నీరందించడమే లక్ష్యంగా ఖరీఫ్‌కు సిద్ధంగా ఉన్నాం.

– పొన్నాడ సుధాకరరావు, ఎస్ఈ, జల వనరుల శాఖ

కొనసాగుతున్న రైల్వే విచారణ కేంద్రం

విజయనగరం టౌన్:

ఒడిశాలోని ఘోర రైలు ప్రమాదానికి సంబంధించి విజయనగరం రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విచార ణ కేంద్రం మూడో రోజు ఆదివారం కూడా కొనసాగించారు. ప్రయాణికులకు రైళ్ల వివరాల ను ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూ వారికి దారి మళ్లింపు రైళ్ల వివరాలను తెలియపరిచారు. అయితే ప్రయాణికుల రద్దీ లేకపోవడంతో రైల్వేస్టేషన్ ఆదివారం ఖాళీగా దర్శనమిచ్చింది. తప్పనిసరి ప్రయాణాలు చేయాల్సిన వారు దారి మళ్లించిన రైళ్ల ద్వారా తమ ప్రయాణాలు చేస్తున్నారు. మిగతా వారంతా ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. ఇదిలా ఉంటే ప్రయాణికుల సౌలభ్యం కోసం రైల్వేశాఖ రిజర్వేషన్ క్యాన్సిలేషన్, రిఫండ్ ఇవ్వడం చేసింది. సుమారు 17 రైళ్లను ఈస్ట్‌కోస్ట్ రైల్వే శాఖ రద్దు చేసింది.



రైల్వే శాఖ ఏర్పాటు చేసిన విచారణ కేంద్రం వద్ద అధికారులు

అత్యంత వైభవంగా పాణిహటి ఉత్సవం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం పవిత్ర నాగావళి నదిలో హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో పాణిహటి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. నితాయి, గౌరంగ (శ్రీకృష్ణ బలరాములు) విగ్రహాలకు పల్లకిలో ఉత్సవం నిర్వహించారు. నితాయి గౌరంగ విగ్రహాలకు పవిత్ర నాగావళి నదిలో భక్తుల చేతుల మీదుగా పుష్పాలతో వర్షం కురిపించారు. అనంతరం స్వామివారికి అభిషేకం, వివిధ పండ్ల రసాలు, నదీ జలాలు, పంచగవ్యాలు, వివిధ పుష్పాలతో మంత్రోచ్ఛరణలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.నిష్కించిన భక్తదాస హరేకృష్ణ పాణిహటి ఉత్సవం ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ బిఎల్.నగేష్, తోటపల్లి టెంపుల్స్ డవలప్‌మెంట్ సేవా ట్రస్టీ డి.ధనుంజయరావు, ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డి.పారినాయుడు, భక్తులు పాల్గొన్నారు.



నితాయి, గౌరంగ విగ్రహాలకు అభిషేకం నిర్వహిస్తున్న డా.నిష్కించిన భక్తదాస బృందం

సమష్టి కృషితో పురస్కారాల పంట

- హెల్త్ ఐడీల నమోదులో జిల్లాకు ఆయుష్మాన్ ఉత్కృష్ట పురస్కారం
- పారిశుద్ధ్యంలో సాలూరు మున్సిపాలిటీకి అవార్డు
- స్వచ్ఛత పరిశుభ్రతలో జోగింపేట పంచాయతీకి పురస్కారం
- గిరిజనులకు మొబైల్ టవర్ల ఏర్పాటులో ఆశావహ జిల్లాగా ఎంపిక



సాలూరు పట్టణానికి జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం టౌన్: జిల్లా యంత్రాంగం సమష్టి కృషితో పార్వతీపురం మన్యం జిల్లా జాతీయ అవార్డులు సాధిస్తూ రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. జాతీయ స్థాయిలో ఆయుష్మాన్ ఉత్కృష్ట పురస్కారం, స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు జిల్లాకు రావటంతో రెట్టింపు ఉత్సాహంతో జిల్లా అధికార యంత్రాంగం మరిన్ని జాతీయ స్థాయి పురస్కారాలు సాధించేలా, జిల్లాను మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేలా చర్యలు చేపట్టింది. ఇదే స్ఫూర్తి కొనసాగించి మరింత ప్రగతి దిశగా అడుగులు వేయాలని, జాతీయ స్థాయిలో మరిన్ని అవార్డులు సాధించి ఆదర్శంగా నిలవాలన్న కృషితో పని చేస్తున్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ప్రణాళికలు రూపొందించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వాహణ, ఆరోగ్య రంగంలో దృష్టి సారించి స్ప్రేయింగ్, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య అంశాలపై చర్యలు చేపట్టారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుకు కృషి చేస్తున్నారు. మాతృ శిశు మరణాల నివారణ, అక్షరాస్యత పెంపు, గ్రామీణ పేదరిక నిర్మూలన వంటి లక్ష్యాల కోసం వైద్య సిబ్బంది ప్రణాళికలు రూపొందించారు. ఫలితంగా జిల్లాకు జాతీయ స్థాయిలో వరుసగా పురస్కారాలు వరిస్తున్నాయి.

హెల్త్ అకౌంట్‌ల నమోదులో దేశంలోనే ఫస్ట్

పార్వతీపురం మన్యం జిల్లాకు అయుష్మాన్ ఉత్కృష్ట పురస్కార్ లభించింది. జాతీయ ఆరోగ్య అధీకృత సంస్థ ఆరోగ్య మంతన్ 2022 కింద ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లో భాగంగా 2022 ఆగస్టు 1వ తేదీ నుండి సెప్టెంబర్ 19వ తేదీ వరకు జరిగిన కార్యక్రమాలకు ఈ పురస్కారం దక్కింది. జిల్లాలో 9,21,563 మంది జనాభాకు 6,62,171 మందికి హెల్త్ అకౌంట్‌లు పూర్తి చేసినందుకుగానూ దేశంలోనే పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. జాతీయ ఆరోగ్య అధీకృత సంస్థ (నేషనల్ హెల్త్ అథారిటీ) ప్రకటించిన ఉత్తమ రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ నిలవగా రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా నిలిచింది. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఎబీహెచ్ఏ) లో భాగంగా ప్రతి ఒక్కరికీ 14 అంకెల ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుంది. ఈ ప్రత్యేక సంఖ్య దేశంలో ఎక్కడకు వెళ్లి వైద్యం చేసుకున్నా రోగి ఆరోగ్య చరిత్ర తెలియజేస్తుంది. గర్భిణులు సంపూర్ణ పోషణ కిట్లు పొందుతున్నారా.. లేదా.. అనే అంశాన్ని కూడా పర్యవేక్షణ చేసేందుకు ఉపయోగపడుతుంది.

జాతీయ అవార్డుకు జోగింపేట పంచాయతీ

జాతీయ అవార్డుకు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంకు చెందిన జోగింపేట పంచాయతీ ఎంపికైంది. ఈ మేరకు పర్యావరణ, అటవీ శాఖ మంత్రిత్వ శాఖ నుండి వర్తమానం అందింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా జూన్ 5వ తేదీన న్యూఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగే వేడుకల్లో పంచాయతీలకు అవార్డులు ఇవ్వనున్నారు. పచ్చదనం, పరిశుభ్రత (క్లీన్ అండ్ గ్రీన్) విభాగంలో జోగింపేట పంచాయతీ ఎంపికై ంది. రాష్ట్రంలో మూడు పంచాయతీలు పచ్చదనం, పరిశుభ్రత (క్లీన్ అండ్ గ్రీన్) విభాగంలో ఎంపిక కాగా వీటిలో జోగింపేట ఒకటి. జోగింపేట పంచాయతీ సర్పంచ్ కల్యంపూడి సింహాచలం నేతృత్వంలో శతశాతం బహిరంగ మలవిసర్జన లేని పంచాయతీగా, తాగునీటి సరఫరా, పచ్చదన గ్రామం, మురుగునీరు పారుదల – పారిశుద్ధ్యం, పౌష్టికాహారం విధానాలు పాటించడం, సుపరిపాలన, వీధి దీపాలు ఏర్పాటు వంటి చర్యలు చేపట్టారు. జోగింపేట గ్రామ పరిధిలో 540 మొక్కలు నాటి పచ్చదనం కల్పించడంతో పాటు, ఆహ్లాదకర వాతావరణం తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు.



జిల్లాకు అందిన ఆయుష్మాన్ ఉత్కృష్ట పురస్కారం

సాలూరు పట్టణానికి జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

చెత్త సేకరణ, శుద్ధిలో ఉత్తమ విధానాలను అమలు చేస్తున్న సాలూరు పురపాలిక జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు ఎంపికైంది. ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని కేంద్ర మంత్రుల చేతుల మీదుగా రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్, పురపాలక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో కలెక్టరు నిషాంత్‌కుమార్, పుర అధ్యక్షురాలు పి.ఈశ్వరమ్మ, కమిషనరు శంకరరావు అందుకున్నారు. సాలూరు పట్టణంలో రోజుకు 13.5 టన్నుల చెత్తను సేకరించి సేంద్రియ ఎరువుగా మారుస్తున్నారు. దీని అమ్మకాల ద్వారా ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం సమకూర్చుకుంటున్నారు. దీంతో పాటు స్వచ్ఛతకు చేపడుతున్న కార్యక్రమాలు మెచ్చి స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారానికి ఎంపిక చేశారు.

జిల్లా మరో మైలు రాయిని చేరుకుంది

జిల్లా మరో మైలు రాయిని చేరుకుంది. జాతీయ స్థాయి సంస్థ నీతి అయోగ్ వివిధ రంగాలలో అభివృద్ధి సాధించుటకు ఆశావహ జిల్లాలను ఎంపిక చేయడం అందులో 2022 అక్టోబరు నెలలో జిల్లాను చేర్చడం జరిగింది. అప్పటి నుండి నీతి అయోగ్ పొందుపరచిన శీర్షికలు (థీమ్) – వైద్య ఆరోగ్య, విద్యా, వ్యవసాయం, నైపుణ్య అభివృద్ధి, ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పనా రంగంలో అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అనేక చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనా రంగంలో భాగంగా మొబైల్ టవర్ల కల్పన, మారుమూల ఆవాసాలకు పీఎంజీఎస్‌వై కింద రహదారుల నిర్మాణం, గ్రామాల్లో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తేవడం, గృహ నిర్మాణాలు వేగవంతం చేయడం తదితర పనులను చేపట్టడం జరుగుతోంది. అనతి కాలంలోనే నీతి అయోగ్ ప్రశంసలు అందుకుంది. ఆశావహ జిల్లాల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పనా రంగంలో జాతీయ స్థాయిలో మంచి స్థానాన్ని సాధించి రూ.3 కోట్ల అదనపు నిధుల కేటాయింపు పొందింది. 2022 డిసెంబరు నాటికి ఉన్న ప్రగతిని ఆధారంగా చేసుకుని ర్యాంకులను నిర్ణయించారు. ప్రగతి, ర్యాంకు ఆధారంగా అదనంగా రూ.3 కోట్ల నిధులు కేటాయింపునకు అర్హత సాధించింది. సుదూర ప్రాంతాల ప్రజల మొబైల్ కనెక్టివిటీకి జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని మెచ్చుకుంది.



గిరిశిఖర గ్రామాల్లో ఏర్పాటు చేసిన మొబైల్ టవర్ల వద్ద ఫోన్లతో గిరిజనులు

అన్ని శాఖల సమన్వయంతోనే..



జిల్లాలోని అన్ని శాఖల అధికారుల కృషి ఫలితంగా జాతీయ స్థాయిలో పార్వతీపురం మన్యం జిల్లాకు పురస్కారాలు దక్కాయి. క్షేత్ర స్థాయిలో ప్రతీ ఉద్యోగి కృషి ఫలితమే ఈ పురస్కారాలు. గిరిశిఖర గ్రామాల్లో ఆరోగ్య ఐడీలు నమోదులో ఆరోగ్య సిబ్బంది పనితీరు అభినందనీయం. రానున్న రోజుల్లో అధికారుల సమన్వయంతో జాతీయ స్థాయి పురస్కారాలు సాధించేలా, జిల్లాను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

మన్యంలో ఈదురుగాలులతో వర్షం



కొమరాడ: విక్రంపురంలో కురుస్తున్న వర్షం

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లాలో పలుచోట్ల ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పగలంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. పాలకొండ ప్రాంతంలో ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఏజెన్సీలో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపుతో కూడిన భారీ వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

ఈదురుగాలులతో వర్షం

కొమరాడ: మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఏరువాక పౌర్ణమి రోజున వర్షం కురవడంతో రైతులు సంతోషపడుతున్నారు. మరోవైపు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు చల్లబడిన వాతావరణంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

మామిడికి నష్టం

సీతంపేట: సీతంపేటలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో మామిడికి నష్టం ఏర్పడిందని గిరిజనులు తెలిపారు. గ్రామాల్లో పసుపు, అల్లం వంటి పంటలకు కొంత మేర నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.



కురుపాం: ఈదురు గాలులకు కూరాకుల వీధిలో నేలకొరిగిన చెట్లు

ఈదురుగాలుల బీభత్సం

కురుపాం: మండలంలో ఆదివారం వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. కురుపాం పంచాయతీ కేంద్రంలోని పండావీధికి చెందిన గంగవంశం రాముకు చెందిన రేకిల్లు పూర్తిగా దెబ్బతింది. సారికవీధిలోని రొంపిలి లక్ష్మి ఇంటిపై చెట్టు కూలిపోవడంతో పాక్షికంగా దెబ్బతింది. కూరాకుల వీధిలో చెట్లు ఇళ్లు, విద్యుత్ స్తంభాలపై కూలడంతో విద్యుత్ స్తంభాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

క్లుప్తంగా

జనరల్ నర్సింగ్ కోర్సులకు ఉచిత శిక్షణ

పార్వతీపురం టౌన్: ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు కిమ్స్ నర్సింగ్ ఆఫ్ ఒంగోలు కళాశాలలో జనరల్ నర్సింగ్ కోర్సు ఉచిత శిక్షణకు అర్హులని కళాశాల ఎగ్జిక్యూటివ్ ఎస్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనర్ కోటాలో ఉచితంగా శిక్షణ అందజేస్తామన్నారు. మొదటి సంవత్సరం పూర్తయిన తరువాత రెండవ సంవత్సరం నుంచి రూ. 7 వేలు స్టైపెండ్ ఇస్తామని తెలిపారు. ఉచిత హాస్టల్ సదుపాయం ఉందని ఆసక్తి ఉన్నవారు ఈ నెల 21వ తేదీలోపు కళాశాల వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9398917283,7020408565 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

8న విశాఖలో వాలీబాల్ జట్ల ఎంపిక

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఆలిండియా ట్రైబల్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ భగవాన్ దాస్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విశాఖలోని రైల్వే గ్రౌండ్స్‌లో జరిగే ఎంపిక పోటీల్లో ట్రైబల్ క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు విధిగా కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఆ రోజు రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు హాజరవుతారన్నారు.

బాలేశ్వర్‌కు నాలుగు అంబులెన్సులు


108 అంబులెన్సుల జిల్లా మేనేజర్ మన్మథరావు

పార్వతీపురం టౌన్: ఒడిశా రాష్ట్రంలోని బాలేశ్వర్‌లో జరిగిన రైలు ప్రమాద బాధితుల సహాయం నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా నుంచి నాలుగు అంబులెన్సులను పంపించినట్లు 108 అంబులెన్సుల జిల్లా మేనేజర్ మన్మథరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్షతగాత్రులను వైద్యశాలలకు తరలించేందుకు, వారికి వైద్య సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంబులెన్సులను పంపించామన్నారు. వైద్యసేవలు అందించేందుకు ఇతర రాష్ట్రానికి అంబులెన్సులు పంపించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

ఆటోను ఢీకొన్న కారు: పలువురికి గాయాలు

పార్వతీపురం/సీతానగరం: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొనడంతో సీతానగరం మండలంలో ఆదివారం పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలంలోని జోగింపేటకు చెందిన సొంబరిక లక్ష్మి, భర్త కిరణ్‌తో కలిసి సొంత ఆటోలో జోగింపేటనుంచి కాశీపేటకు వెళ్తుండగా, మార్గమధ్యంలో కొంతమంది ప్రయాణికులు ఆటో ఎక్కారు. ఈ రహదారి పరిధిలో చినభోగిలి వద్దకు ఆటో వచ్చేసరికి బొబ్బిలి నుంచి పార్వతీపురం వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జు నుజ్జు కాగా, ప్రయాణికులతో ఉన్న ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కిరణ్, గెడ్డలుప్పికి చెందిన అల్లు లక్ష్మి, బొంగల సంజీవినాయుడు, కారు డ్రైవర్ సందీప్‌కుమార్, కారులో ఉన్న బి.ఇందిరకు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు క్షతగాత్రులను 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

కొట్లాటలో ఒకరికి..

పార్వతీపురం: ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన వాగ్వాదం కొట్లాటకు దారి తీయడంతో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామానికి చెందిన చింతల ప్రసాద్..అదే గ్రామానికి చెందిన చింతల లక్ష్మణరావు శనివారం రాత్రి ఆంజనేయ స్వామి గుడివద్ద వాగ్వాదానికి దిగారు. నామీద డబుల్‌మీనింగ్ డైలాగ్‌లు మాట్లాడుతున్నావంటూ ప్రసాద్ చేతిని లక్ష్మణరావు నులిపివేసి చొక్కా చించివేశాడు. ఈ ఘటనలో ప్రసాద్ చేతికి తీవ్ర గాయమైంది.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,330-00
బంగారం(22సి. 10గ్రా.)	55,300-00
వెండి (కిలో)	77,800-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹ 284

ఉత్సాహంగా మహిళా 'ఏపీఎల్-2'

- అట్టహాసంగా ప్రారంభమైన టీ-20 టోర్నీ
- టోర్నీ బ్రాండ్ అంబాసిడర్‌గా యాంకర్ రష్మీగౌతమ్


విజయనగరం రాయల్స్ జట్టు విజయహాసం


బెజవాడ బ్లేజర్స్, రాయలసీమ క్వీన్స్ జట్ల సభ్యులతో ఏసీఏ సీఈవో శివారెడ్డి, తదితరులు

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో మహిళా ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) టీ-20 క్రికెట్ టోర్నీ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. విజయనగరం జిల్లా కేంద్రం శివారు చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో ఏసీఏ సీఈవో ఎం.వి. శివారెడ్డి టోర్నీని ప్రారంభించారు. మహిళా టీ- 20 టోర్నీ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ టీవీ యాంకర్, నటి రష్మీ గౌతమ్ వ్యవహరించి టోర్నీ ప్రారంభానికి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. టోర్నీ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శివారెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నీలో విజయనగరం రాయల్స్, వైజాగ్ డాల్ఫిన్స్, బెజవాడ బ్లేజర్స్, రాయలసీమ క్వీన్స్ జట్లు పోటీ పడతాయన్నారు. లీగ్ మ్యాచ్‌ల అనంతరం ఫైనల్ పోరు విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంత మహిళా క్రీడాకారిణుల కు జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడానికి ఈ టోర్నీ ఉపయోగపడుతుందన్నారు. మహిళా క్రికెటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టోర్నీలో ఉత్తమ ప్రతిభ చూపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏసీఏ జాయింట్ సెక్రటరీ ఎ.రాకేష్, విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ఏసీఏ లీగల్ మేనేజర్ డి.నాగేశ్వరరాజు, ఏసీఏ నార్త్‌జోన్ అకాడమీ చైర్మన్ జీవీఎస్ఎన్ రాజు, ఏసీఏ నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ కన్వీనర్ పీవీ దేవవర్మ, క్రీడాకారుల ప్రతినిధి గీత, తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బ్లేజర్స్ విజయదుందుభి

తొలిరోజు ఉదయం బెజవాడ బ్లేజర్స్, రాయలసీమ క్వీన్స్ జట్ల మధ్య జరిగిన బెజవాడ బ్లేజర్స్ జట్టు 14 పరుగుల తేడాతో రాయలసీమ జట్టుపై గెలుపొందింది.

విజయనగరం రాయల్స్ విజయం

మధ్యాహ్నం వైజాగ్ డాల్ఫిన్స్, విజయనగరం రాయల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విజయనగరం జట్టు 7వికెట్ల తేడాతో వైజాగ్ జట్టుపై విజయఢంకా మోగించింది.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో వివిధ కేటగిరిల్లో పోస్టుల భర్తీకి విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పర్యవేక్షణలో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు దివ్యాంగుల పునరావాస కేంద్రం ఇన్‌చార్జ్ ఆర్.జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పునరావాస కేంద్రంలో అవసరమైన పోస్టులు, వాటికి అవసరమైన అర్హతల వివరాలను ప్రకటించారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి బయోడేటా ఫారంతో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం పేరుతో ఈ నెల 14వ తేదీలోగా కలెక్టరేట్‌లోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం చిరునామాకు స్వయంగా లేదా పోస్టుద్వారా సమర్పించుకోవాలి. పూర్తి వివరాల కోసం 08922-274647 ఫోన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పోస్టులు, అర్హతల వివరాలు:

- క్లినికల్ సైకాలజిస్ట్ (ఖాళీ-1)
- వైకల్యం పునరావాస రంగంలో 2 సంవత్సరాల అనుభవంతో క్లినికల్ సైకాలజీలో ఎం.ఫిల్/సైకాలజీలో ఎంఏ విద్యార్హత ఉండాలి.
- సీనియర్ ఫిజియోథెరపిస్ట్ ఆక్యుపేషనల్ థెరపిస్ట్ (ఖాళీ-1)
- సంబంధిత విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, 5 సంవత్సరాల అనుభవం ఉండాలి.
- ఆర్థోపెడికల్లీ హ్యాండీక్యాప్డ్ సీనియర్ ప్రొస్థెటిస్ట్ ఆర్థోటిస్ట్ (ఖాళీ-1)
- 5 సంవత్సరాల అనుభవంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ప్రొస్థెటిక్, ఆర్థోటిక్‌లో డిగ్రీ లేదా 6 సంవత్సరాల అనుభవంతో ప్రొస్థెటిక్ అండ్ ఆర్థోటిక్‌లో డిప్లమో ఉండాలి.
- ప్రొస్థెటిస్ట్ ఆర్థోటిస్ట్/టెక్నీషియన్ (ఖాళీ-1)
- ఐటీఐ 2/3 సంవత్సరాల అనుభవంతో శిక్షణ పొంది ఉండాలి.
- సీనియర్ స్పీచ్ థెరపిస్ట్ ఆడియాలజిస్ట్ (ఖాళీ-1)
- సంబంధిత రంగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్/బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్)
- అసిస్టెంట్ జూనియర్ స్పీచ్/థెరపిస్ట్ (ఖాళీ-1) : డిప్లమో ఇన్ స్పీచ్ అండ్ హియరింగ్ విత్ హియరింగ్ ఎయిడ్స్ రిపేర్/ఇయర్ మోల్డ్ మేకింగ్ పరిజ్ఞానం
- మొబిలిటీ ఇన్‌స్ట్రక్టర్ (ఖాళీ-1)
- మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్/డిప్లమో ఇన్ మొబిలిటీ
- మల్టీపర్పస్ రిహ్యాబిలిటేషన్ (ఖాళీ-1)
- సీబీఆర్/ఎంఆర్‌డబ్ల్యూ కోర్సులో డిప్లమోతో ఇంటర్‌మీడియట్ లేదా ప్రత్యేక విద్యలో ఒక సంవత్సరం డిప్లమో కోర్సుతో పాటు రెండేళ్ల అనుభవం
- అకౌంటెంట్ కమ్ క్లర్క్ కమ్ స్టోర్ కీపర్ (ఖాళీ-1)
- రెండు సంవత్సరాల అనుభవంతో బీకాం /ఎస్ఏఎస్
- అటెండెంట్ కమ్ ప్యూన్ కమ్ మెసెంజర్
- 8వ తరగతి విద్యార్హత
- ఫీల్డ్ అండ్ పబ్లిసిటీ అసిస్టెంట్
- గ్రాడ్యుయేట్
- ఒకేషనల్ కౌన్సెలర్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్
- గ్రాడ్యుయేట్

ప్రాణం తీసిన నిద్రమత్తు!

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం
- కుమార్తె పరిస్థితి విషమం


పెద్దయ్య మృతదేహం


మృతి చెందిన పావని

కొమ్మాది/ఆరిలోవ: ఓ కుటుంబం తమ బంధువుల శుభకార్యానికి వెళ్లింది. అక్కడ రాత్రంతా సంతోషంగా గడిపారు. తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. సాగర్‌నగర్ దరి బీచ్‌రోడ్డులో బే పార్కు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. డివైడర్‌ను ఢీకొట్టడమే ఈ ప్రమాదానికి కారణమని ఆరిలోవ పోలీసులు భావిస్తున్నారు. వారు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన మైలపల్లి పెద్దయ్య(30), అతని భార్య పావని(25), మూడేళ్ల కుమార్తె యక్షిత నగరంలోని జాలరిపేటలో నివాసముంటున్నారు. పెద్దయ్య కూలి పనులు చేస్తుంటాడు. సొంత ఊరులో బంధువుల వివాహం కోసం వారు ముగ్గురు కలసి బైక్‌పై శనివారం బయలుదేరి వెళ్లారు. రాత్రంతా పెళ్లిలో అందరితో సరదాగా గడిపి.. తిరిగి ఆదివారం వేకువజామున అదే బైక్‌పై నగరానికి వస్తున్నారు. జాతీయ రహదారి వద్ద ఎండాడ నుంచి రుషికొండ వెళ్లి.. అక్కడ నుంచి బీచ్‌రోడ్డులో జాలరిపేట వస్తుండగా బైక్ అదుపు తప్పింది. బే పార్కు, రాడిసన్ బ్లూ హోటల్ మధ్యలో ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో పెద్దయ్య తలకు తీవ్ర గాయం కావడంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. కొన ఊపిరితో ఉన్న అతని భార్య పావని, కుమార్తె యక్షితను స్థానికులు గీతం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పావని మృతి చెందింది. యక్షితను కేజీహెచ్‌కు తరలించారు. యక్షిత ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతోంది. భార్యాభర్తల మృతదేహాలను పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు మామ ఎరుపల్లి సన్యాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిద్ర మత్తులో బైక్ సరిగా నడపలేక డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

రూ.10.35 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తుల కొనుగోలు

పార్వతీపురం టౌన్: గిరిజన ప్రాంతంలో జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోలు వేగవంతం చేస్తున్నట్లు జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో చింతపండు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు ముమ్మరం చేశామని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం రూ. 4.30కోట్లు కాగా లక్ష్యానికి మించి రూ.10.35 కోట్ల విలువగల ఉత్పత్తులను కొనుగోలు చేశామన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర ద్వారా సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. గిరిజన రైతులు జీసీసీ నిర్వహించిన గిట్టుబాటు ధరలు పొందాలని కోరారు.

చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మరు

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలను రైతులు నమ్మే పరిస్థితి లేదని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన సాలూరు పట్టణంలో తన గృహంలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయం దండగంటూ చంద్రబాబు గతంలో చెప్పిన మాటలు, చంద్రబాబు పాలనలో బషీర్‌బాగ్‌లో రైతులపై జరిపిన కాల్పులను తెలుగు ప్రజలు, రైతులెవరూ మర్చిపోలేరని గుర్తుచేశారు. రైతు రుణమాఫీ చేస్తానని చెప్పి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రూ.87వేల కోట్ల రైతు రుణమాఫీ చేయాల్సి ఉండగా, రూ.15 వేల కోట్లు మాత్రమే చేసి రైతులకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు. అటువంటి చంద్రబాబు రైతులకు అన్నదాత పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని మరో అబద్ధపు హామీని మాయనాడులో ప్రకటించారని ఎద్దేవా చేశారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక


ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనబోయే రాష్ట్ర జట్ల ఎంపికలు ఆదివారం విజయనగరంలో నిర్వహించారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 50 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 6గురు బాలురు, 6 గురు బాలికలను రాష్ట్ర జట్టులోకి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16 నుంచి తమిళనాడులో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, అధ్యక్షుడు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావులు తెలిపారు. జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి తవిటయ్య, పీడీలు గోపాల్, శ్రీను, శివ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతుల పర్యటన


తెలంగాణ రైతులకు వివరిస్తున్న వాసన్ ప్రతినిధులు

భామిని: పార్వతీపురం మన్యం జిల్లాలో సాగుతున్న సేంద్రియ వ్యవసాయ విధానాల పరిశీలనకు తెలంగాణ రాష్ట్రంలోని జనగామ జిల్లా గోవర్ధన గిరికి చెందిన రైతుల బృందం ఆదివారం భామిని మండలంలో పర్యటించింది. ఇక్కడ నిర్వహిస్తున్న జీవ ఎరువుల తయారీ కేంద్రా(బయో రీసోర్స్ సెంటర్)న్ని తెలంగాణ రైతుల బృందం పరిశీలించి సుమారు రూ.3లక్షల వ్యయంతో వాసన్ సంస్థ నిర్మించిన బయో రీసోర్స్ సెంటర్ పనితీరు, సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని తెలుసుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ ఆర్థిక సహాయంతో నిర్మించిన జీవ ఎరువుల తయారీ కేంద్రంలో 60 పశువుల మూత్ర నిలువ సామర్థ్యం గుర్తించారు. సుస్థిర వ్యవసాయంలో సేంద్రియ సాగు పద్ధతులను వాసన్ సంస్థ కోఆర్డినేటర్లు ముద్దాడ భార్గవి, కుండింగి రవికుమార్‌లు తెలంగాణ రైతుల బృందానికి వివరించారు.

పారదర్శకంగా క్రికెట్ క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు తదితరులు

- నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలపై విచారణ చేయిస్తాం
- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు

విజయనగరం: జిల్లా స్థాయిలో నిర్వహించే క్రికెట్ క్రీడాకారుల ఎంపికల్లో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు స్పష్టం చేశారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విశాఖకు చెందిన క్రీడాకారులు జిల్లా తరఫున ఆడుతున్నట్లు వస్తున్న ఆరోపణలు ఖండిస్తున్నానన్నారు. ఈ మేరకు ఆదివారం విజ్జి స్టేడియంలో సీనియర్స్ విభాగంలో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులకు, కోచ్‌లకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అండర్-12, 14,16, 19, 23 కేటగిరీలతో పాటు సీనియర్స్ విభాగంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. ఇప్పటికే పలువురు నార్త్‌జోన్‌తో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా వారికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం క్రీడాకారుడి స్వస్థలం, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ పరిశీలించిన తరువాతనే ఎంపిక పోటీలకు అనుమతిస్తున్నట్లు చెప్పారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

ఇటీవల కాలంలో విశాఖ జిల్లా క్రీడాకారులు నకిలీ ధృవపత్రాలతో విజయనగరం జట్టు తరుపున ఆడేందుకు ప్రయత్నిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అసోసియేషన్ తరపున కృషి చేస్తున్నామని, రంజీ ట్రోఫీకి ఎంపికైన క్రీడాకారుడికి సొంత ఖర్చులతో ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు చక్కని అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి పి.సీతారామరాజు, పెనుమత్స బంగార్రాజు, వర్మ, సర్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుత ప్రతిభ దివ్యాంగుల సొంతం

- రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు


దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

శృంగవరపుకోట: అద్భుతమైన ప్రతిభ కలవారు దివ్యాంగులు. వారికి సరైన అవకాశాలు, ఇస్తే అద్భుతాలు సాధిస్తారని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ ఎల్.నరసింహారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక ఆర్.కె.ఫంక్షన్‌హాల్‌లో ఎన్‌పిడిఓ సంయుక్త కార్యదర్శి జె.రమణ నేతృత్వంలో దివ్యాంగుల హక్కులు- చట్టాలు అన్న అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అంగవైకల్యం ఉన్నవారిని దివ్యాంగులు అని పిలిచారన్నారు. పలు రంగాల్లో దివ్యాంగులు వారి ఇబ్బందుల్ని పక్కన పెట్టి విజయాలు సాధించారని ప్రశంసించారు. దివ్యాంగుల్లోని ప్రతిభను గుర్తించాల్సిన సామాజిక బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏపీ దివ్యాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులు, చట్టాల గురించి స్వచ్ఛంద సంస్థలు, పనిచేయాలని కోరారు. దివ్యాంగుల గౌరవానికి భంగం కల్గిస్తే తీవ్రమైన నేరంగా పరిగణిస్తారన్నారు. దివ్యాంగుల హక్కులు-చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌పీడీఓ ప్రతినిధులు జీలకర్ర రమణ, కె.మధు, భువనేశ్వరీదేవి, ఎస్.మహేష్, కె.దాలినాయుడు, ఆర్.ప్రసాద్, పి.భానుప్రకాష్, ఎ.అప్పారావు, ఎస్.సన్యాసినాయుడు, షేక్ నూర్ బాషా, వి.మధుసూదనరావు తదితరులు హాజరై ప్రసంగించారు. ఐదు మండలాలకు చెందిన దివ్యాంగ సంఘాల ప్రతినిధులు, పలువురు దివ్యాంగులు కార్యక్రమానికి హాజరయ్యారు.

విషాదం

వేర్వేరు సంఘటనల్లో మనుషులతో పాటు మూగజీవాల మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆదివారం జరిగిన పలు సంఘటనలలో మనుషులతో పాటు మూగజీవాలు మృతి చెందాయి. ఆయా సంఘటనలకు సంబంధించి బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.


విజయనగరం క్రైమ్: అప్పలరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై గణేష్

విజయనగరం క్రైమ్: మండలపరిధిలోని సారిక సమీపంలో అంబటివలస గ్రామానికి చెందిన తాడ్డి అప్పలరాజు (30) పిడుగు పాటుతో మృతి చెందాడు. మామిడి పండ్ల ప్యాకింగ్ కి సంబంధించిన పనిలో అప్పలరాజు మామిడితోటలో నిమగ్నమై ఉన్న సమయంలో సాయంత్రం గాలివానతో పాటు పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు.

రెండు మేకలు, ఒక ఆవు, ఎద్దు..

గుమ్మలక్ష్మీపురం/పాలకొండ: మండలంలోని బాలేసు పంచాయతీ బయ్యద గ్రామంలో పిడుగు పాటుకు రెండు మేకలు,ఒక ఆవు మృతి చెందాయి. ఈదురు గాలులతో కూడిన వర్షంతో పాటు భారీ శబ్దంతో గ్రామంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో ఆ ధాటికి పక్కనే పశువుల పాకలో ఉన్న మేకలు, ఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే పాలకొండ మండలంలో సింగన్నవలస గ్రామానికి చెందిన రైతు మునికోటి రవికి దుక్కిటెద్దు పిడుగుపాటుకు గురై మృతి చెందింది.

విద్యుత్ పరికరాలు ధ్వంసం

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు పంచాయితీ నిమ్మలపాడు గ్రామానికి చెందిన డొంకాడ పోలినాయుడుకు చెందిన ఇంటిపై పిడుగుపడడంతో ఇంటిలో ఉన్న విద్యుత్‌పరికరాలు ధ్వంసమయ్యాయి. వాటి విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. టీవీ,ఇన్వర్టర్, ఏసీతో పాటు ఇటీవలే విద్యుత్‌వైర్లు వేయగా అంతా నాశనమైందని బాధితుడు లబోదిబో మంటున్నాడు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని అధికారులను కోరుతున్నాడు.

పురుగు మందు తాగి వీఆర్ఏ ఆత్మహత్య


గంట్యాడ: ఆత్మహత్యకు పాల్పడిన వెంకటరావు

గంట్యాడ: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన వీఆర్ఏ బ్రాందెపురపు వెంకటరావు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీఆర్ఏ వెంకటరావు భార్య విశాఖపట్నంలో కన్నవారింటి వద్ద రెండు సంవత్సరాలుగా ఉంటోంది. తరచూ ఫోన్ చేసి గ్రామానికి రమ్మని అడిగినప్పటికీ రావడం లేదు. శనివారం కూడా భార్యకు ఫోన్ చేసి రమ్మని పిలిచాడు. అయినప్పటికీ ఆమె రాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందు తాగేశాడు. అది గమనించిన కుటుంబసభ్యులు 108 అంబులెన్సు ద్వారా విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వడదెబ్బతో రైతు మృతి


లక్కవరపుకోట: మృతి చెందిన రైతు అప్పారావు (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేంపూడా గ్రామానికి చెందిన రైతు పిల్ల అప్పారావు(62) వడ దెబ్బతో ఆదివారం మృతి చెందాడు. ఉదయం 11 గంటలకు తన పశువుల శాల వద్ద వ్యవసాయ పనులు ముగించుకుని అప్పారావు ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో స్పృహ తప్పి పడిపోయాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి హుటాహుటిన ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. వైద్యులు మృతదేహాన్ని చూసి వడ దెబ్బ కారణంగానే మృతి చెందినట్లు నిర్ధారించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


సీతానగరం: గోతిలో గుర్తు తెలియని మృదేహం

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట- పాత బొబ్బిలి గ్రామాల మధ్య రాష్ట్రరహదారిని ఆనుకుని నీరున్నగోతిలో గుర్తు తెలిమని మృతదేహం లభ్యమైంది. లచ్చయ్యపేట గ్రామానికి చెందిన కొంతమంది యువకులు వాకింగ్ నిమిత్తం పాత బొబ్బిలి వరకూ వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో రోడ్డును ఆనుకుని ఉన్న గోతివైపు చూడగా మృతదేహం ఉన్నట్లు గుర్తించి సీతానగరం పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించే ప్రయత్నం చేశారు. సంఘటనా స్థలంలో ఎటువంటి ఆధారాలు లేక పోవడంతో గ్రామ వీఆర్వో ఆధ్వర్యంలో శవ పంచనామా చేసి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.